క్లుప్తంగా

ఆర్టీసీ పార్శిల్ బుకింగ్ కౌంటర్ ప్రారంభం



ఆర్టీసీ పార్శిల్ కౌంటర్‌ను ప్రారంభిస్తున్న డీఎం గంగాధర్‌రావు

నంద్యాల(వ్యవసాయం): పట్టణ ప్రజల సౌకర్యార్థం టెక్కె మార్కెట్ యార్డు ఎదురుగా ఆర్టీసీ పార్శిల్ బుకింగ్ కౌంటర్‌ను బుధవారం డిపో మేనేజర్ గంగాధర్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాల్సిందిగా కోరారు. ఇక్కడ పార్శిల్ బుకింగ్‌తో పాటు బస్సుల ఆన్‌లైన్ రిజర్వేషన్ కూడా చేయడం జరుగుతుందన్నారు. వివాహాది కార్యక్రమాలకు బస్సులను అద్దెకి సైతం ఇస్తామన్నారు. పై సేవలకు సంబంధించిన మరింత సమాచారం కోసం సెల్ : 6281892299, 9392850152 నంబర్లను సంప్రదించాలని కోరారు.

కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఆర్‌నాయక్

నంద్యాల(న్యూటౌన్): నిబంధనలు పాటించని గుడ్‌షెపర్డ్, భాష్యం, నెరవాటి, గెలివి, నారాయణ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఆర్‌నాయక్ డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వేల రూపాయలు దండుకుంటున్నారన్నారు. విద్యాసంవత్సరం ప్రారంభం కాకముందే పై తరగతికి అనుమతించాలంటే ఫీజు 50 శాతం చెల్లించి రెన్యువల్ చేసుకోవాలని తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్నారని ఆరోపించారు. విద్యాహక్కు చట్టానికి విరుద్ధంగా నడుస్తున్న విద్యా సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామన్నారు.

పాఠశాల అభివృద్ధికి విరాళం



హెచ్‌ఎం సుబ్బరాయుడికి నగదు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

రుద్రవరం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల అభివృద్ధికి అదే పాఠశాలలో 2002 నుంచి 2007 వరకు చదువుకున్న పూర్వ విద్యార్థులు రూ.60 వేలు విరాళం అందించారు. బుధవారం హెచ్‌ఎం సుబ్బరాయుడును కలిసి విరాళ నగదు అందించారు. ఈ నేపథ్యంలో హెచ్‌ఎం వారిని ప్రత్యేకంగా అభినందించారు.

మురుగును తొలగించండి



నర్సాపురంలో నిల్వ ఉన్న మురుగును పరిశీలిస్తున్న ఎంపీడీఓ

రుద్రవరం: ప్రజలు రోగాల బారిన పడక ముందే మురుగును పారదోలాలని ఎంపీడీఓ భాగ్యలక్ష్మి గ్రామ సచివాలయ ఉద్యోగులకు సూచించారు. మండల పరిధిలోని ముత్తలూరు, నర్సాపురం గ్రామ సచివాలయాలను బుధవారం ఆమె తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఆయా సచివాలయాల పరిధిలో సాగుతున్న వివిధ రకాల సర్వేలు, యోగా రిజిస్ట్రేషన్లపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో దోమల వ్యాప్తి పెరిగే అవకాశం ఉందని ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు.

పారిశుద్ధ్యంపై దృష్టి సారించండి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డిప్యూటీ ఎంపీడీఓ తాహీర్ హుస్సేన్

చాగలమర్రి: వర్షాకాలం ప్రారంభంకానున్న నేపథ్యంలో గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ ఎంపీడీఓ తాహీర్ హుస్సేన్ పంచాయతీ కార్యదర్శులకు, ఇంజినీర్ సహాయకులకు ఆదేశించారు. బుధవారం చేపట్టవలసిన పారిశుద్ధ్య చర్యలపై స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా జూన్ నెలలో నీరు -మీరు నిర్వహణపై అవగాహన కల్పించామన్నారు.

ఏదీ వేసవి భత్యం?

- ఉపాధి కూలీల గోడు పట్టని ప్రభుత్వం
- వేసవి భత్యం అమలులో నిర్లక్ష్యం
- ఈ ఏడాది నామమాత్రంగా వేతనం పెంపు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న కూలీలు



గోస్పాడు శివారులో ఎండలో పనులు చేస్తున్న కూలీలు



నిలువనీడ కరువు

గోస్పాడు: గ్రామాల్లో వలసల నివారణ కోసం తీసుకొచ్చిన ఉపాధి హామీ పథకం అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ కూలీల జీవితాలతో చెలగాటమాడుతోంది. సాధారణంగా పల్లెల్లో వ్యవసాయ పనులు పూర్తయిన తర్వాత ఏటా ఫిబ్రవరి నుంచి జూన్ వరకు ఉపాధి పనులు జోరుగా సాగుతుంటాయి. గతంలో వేసవిలో ఎండలకు ఉపాధి కూలీలు ఉపాధిహామీ పనులు చేయలేని పరిస్థితులు ఉండేవి. ఈ నేపథ్యంలో వారిని ప్రోత్సహించేందుకు వేసవి భత్యం అమలు చేసేవారు. అయితే, ఈ ఏడాది ఎండలు మండినా ప్రభుత్వం భత్యం ఇవ్వలేదు. చివరకు చేసిన పనికి కూడా సకాలంలో వేతనం ఇవ్వడం లేదు.

వేసవిలో భత్యం ఇలా...

దినసరి వేతనంపై ఫిబ్రవరిలో 20 శాతం, మార్చిలో 25 శాతం, మేలో 30 శాతం, జూన్‌లో 25 శాతం అదనంగా కూలీలకు అందించేవారు. అయితే ఈ ఏడాది మేనెల పూర్తవుతున్న ఇప్పటి వరకు వేసవి భత్యంపై ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత లేకపోవడంతో కూలీలు ఆందోళన చెందున్నారు. ఉపాధి హామీ పథకం ప్రారంభమైనప్పటి నుంచి టీసీఎస్ సాఫ్ట్‌వెర్ లో కార్యకలాపాలు కొనసాగుతూ వచ్చాయి. అయితే 2021 నవంబర్లో నూతనంగా ఎన్‌ఐసీ సాఫ్ట్‌వేర్‌ను తీసు కొచ్చారు. అందులో వేసవి భత్యానికి సంబంధించి ఎలాంటి ఆప్షన్ ఇవ్వలేదు. దీంతో వేసవి భత్యం అమలు జరగడం లేదని కూలీలు వాపోతున్నారు.

నామమాత్రంగా వేతనం పెంపు..

నంద్యాల నియోజకవర్గంలోని గోస్పాడు, నంద్యాల మండలాల్లో 16,990 జాబ్ కార్డులుండగా అందులో 31,900 మంది సభ్యులున్నారు. వీరిలో రోజుకు ప్రస్తుతం 6,800 మంది పనికి వెళ్తున్నారు. వేసవిలో గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులు అంతంత మాత్రంగా ఉంటాయి. దీంతో చాలా మంది కూలీలు ఉపాధి పనులపై ఆధారపడి జీవనం సాగిస్తుంటారు. అయితే, ఏటా వేసవిలో కేంద్ర ప్రభుత్వం ఉపాధి కూలీల వేతనాలను రూ.20 నుంచి రూ.30 వరకు పెంచేది. ఈ ఏడాది ఏప్రిల్ ఒకటి నుంచి స్వల్పంగా రూ.7ను మాత్రమే పెంచింది. ఏప్రిల్ నుంచి ఉపాధి కూలీలకు రూ.307 చొప్పున వేతనం అందజేయనున్నారు. అయితే, స్థానికంగా అందుకనుగుణంగా పనులు జరగక పోతుండటంతో కూలీలకు పూర్తిస్థాయి వేతనం అందని పరిస్థితి. కొన్ని చోట్ల కూటమిపార్టీల నాయకులు తమకు అనుకూలురైన వారికి పూర్తిస్థాయి వేతనం వేయించి మిగతా కూలీలను అన్యాయం చేసున్నారనే విమర్శలు ఉన్నాయి.

వేసవి భత్యం అందించాలి



గతంలో వేసవిలో ఉపాధి పనులు చేసే వారికి అదనపు కూలి వచ్చేది. ఇప్పుడు రావడం లేదు. వేసవిలో భూమి గట్టిగా ఉండి పనులు చేసేందుకు కష్టంగా ఉంటుంది. పైగా ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. ఇలాంటి సమయంలో కొలతల ప్రకారం పనులు చేస్తే తప్ప సరైన వేతనం అందటంలేదు.ప్రభుత్వం స్పందించి వేసవిభత్యం అందజేసి ఆదుకోవాలి.

–చెన్నయ్య, పసురపాడు

వసతులు కల్పించాలి



వేసవిలో ఉపాధి పనులు చేసే చోట ఎక్కడా కూడా కూలీలకు సౌకర్యాలు కల్పించడం లేదు. పని ప్రదేశంలో సేదతీరేందుకు ఎలాంటి టెంట్లు ఏర్పాటు చేయడం లేదు. దీంతో ఎండలకు కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో మజ్జిగ, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందజేసేవారు. ఇప్పుడు అవి కూడా ఇవ్వడం లేదు. గతంలో ఎండాకాలంలో అదనంగా అలవెన్సులు చెల్లించేవారు. ఇప్పుడు ఏమీ ఇవ్వడం లేదు.

–ఆర్థర్ సైమాన్, ఎంపీపీ గోస్పాడు

పెద్దమ్మ విశిష్టతపై గద్దె



పెద్దమ్మ గురించి గద్దె చెబుతున్న వెంకటలక్ష్మమ్మ

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నెలో వెలసిన మూల పెద్దమ్మ విశిష్టతపై వెంకటలక్ష్మమ్మ గద్దె చెబుతున్నారు. వచ్చే నెల 8, 9, 10 తేదీల్లో దేవరను 11 ఏళ్ల తర్వాత నిర్వహించేందుకు ఆలయ కమిటీ, గ్రామ పెద్దలు నిర్ణయించారు. ఈనెల 11న అమ్మవారికి ముడుపు కట్టడంతో ప్రతి రోజు సాయంత్రం ఆలయ ప్రాంగణంలో పెద్దమ్మ విశిష్టత, వైభవం, శక్తిస్వరూపాలను వివరిస్తున్నారు. పెద్దమ్మ చరితన ప్రతి ఒక్కరూ తెలుసుకొని పునీతులు కావాలని ఆకాంక్షించారు. ఆలయ కమిటీ సభ్యులు తలారి శ్రీనివాసులు, మిద్దె శంకరయ్య, చిన్నన్న, చిన్నపెద్దన్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు.

గృహ నిర్మాణాలకు 510 దరఖాస్తులు

ఉయ్యాలవాడ : మండలంలో గృహ నిర్మాణాలు చేపట్టేందుకు లబ్ధిదారుల నుంచి 510 దరఖాస్తులు వచ్చినట్లు హౌసింగ్ ఏఈ నరసింహరావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ 11 గ్రామ సచివాలయాల పరిధిలోని లబ్ధిదారులు నూతనంగా గృహాలు నిర్మించుకునేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకుని వాటిని కార్యాలయంలో అందజేశారన్నారు. తాము వాటిని జిల్లా ఉన్నతాధికారులకు నివేదిస్తామని చెప్పారు.

యోగాతో మానసిక ఒత్తిడి దూరం



ఉయ్యాలవాడలో యోగా చేస్తున్న ఉద్యోగులు

ఉయ్యాలవాడ: ప్రతి రోజు యోగా చేయడం ద్వారా మానసిక ఒత్తిడి నుంచి బయట పడవచ్చునని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం స్థానిక మోడల్ స్కూల్‌లో యోగా శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని 11 గ్రామ సచివాలయాల ఉద్యోగులకు ట్రైనర్ శివప్రసాద్‌రెడ్డి శిక్షణ ఇచ్చారు. ఎంపీడీఓ మాట్లాడుతూ జూన్ 21న జరిగే ప్రపంచ యోగా డే కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులందరూ సమిష్టితో కృషి చేయాలని కోరారు. ప్రతి గ్రామ సచివాలయంలో శిక్షణ పొందిన ట్రైనర్లు ప్రజల భాగస్వామ్యంతో యోగా కార్యక్రమాన్ని నిర్వహించాలని కోరారు.

యోగాసనాలతో ఆరోగ్యం

నంద్యాల(అర్బన్): యోగాసనాలు చేయడం ద్వారా ఆరోగ్యవంతులవుతారని యోగా మాస్టర్ నాగేంద్ర తెలిపారు. ప్రతి ఒక్కరు యోగాసనాలు నేర్చుకొని ఆచరించాలని సూచించారు. యోగాంధ్రలో భాగంగా స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో బుధవారం మండల స్థాయి అధికారులు యోగాసనాలు చేశారు. రోజుకు అరగంట యోగాసనాలు చేస్తే సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రభాకర్, ఎంపీడీఓ సుగుణశ్రీ, తహసీల్దార్ శ్రీనివాసులు, ఏఓ షానుతో పాటు అధికారులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యం



మలబార్ గోల్డ్ ఆకలి రహిత ప్రపంచ సేవా కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ రవికృష్ణ

నంద్యాల(వ్యవసాయం): మలబార్ గోల్డ్ సంస్థ సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తుందని, ఏటా ఆదాయంలో ఐదుశాతం ఆయా కార్యక్రమాలకు వినియోగిస్తుందని మలబార్ గోల్డ్ నంద్యాల బ్రాంచ్ డైరెక్టర్ మైఈజ్ తెలిపారు. బుధవారం ప్రపంచ ఆకలి రహిత దినోత్సవం సందర్భంగా ఆ సంస్థ ఆధ్వర్యంలో నంద్యాల మలబార్ గోల్డ్ షోరూం దగ్గర ఏర్పాటు చేసిన అన్నదాన సేవలను ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, డాక్టర్ రవికృష్ణ ప్రారంభించారు. తర్వాత సేవా పథకం పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం బ్రాంచ్ డైరెక్టర్ మాట్లాడుతూ మలబార్ ట్రస్టు ద్వారా విద్యార్థులకు ఉపకార వేతనాలు, మహిళా సాధికారత, ఉచిత ఆరోగ్య సేవలు, పర్యావరణ పరిరక్షణ తదితర కార్యక్రమాల నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ మలబార్ గ్రూప్ పేదల ఆకలి తీర్చడానికి భారీ సేవా కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో షోరూం మేనేజర్లు సుధాకర్, గోపి, ప్రతినిధులు మన్సూర్, కిషోర్ పాల్గొన్నారు.

అప్రోచ్ రోడ్డు నిర్మించాలి



కంపచెట్లతో నిండిపోయిన మట్టి రోడ్డు

చాగలమర్రి: మండలంలోని ముత్యాలపాడు గ్రామ సమీపంలో ఎర్ర చెరువు కట్ట కింద అప్రోచ్ రోడ్డు నిర్మాణం చేపట్టి తమ కష్టాలు తీర్చాలని రైతులు అధికారులకు మొరపెట్టుకుంటున్నారు. ఈ చెరువు కింద 3,000 ఎకరాల ఆయకట్టు ఉంది. కింది భాగంలో గత ప్రభుత్వ హయాంలో మెటల్ రోడ్డు నిర్మాణం జరిగింది. అయితే, చిన్నపాటి వర్షానికే నీరు నిలబడి బురదమయంగా మారి రైతుల రాకపోకలకు ఇబ్బంది కలుగుతుంది.ఈ నేపథ్యంలో మైనర్ ఇరిగేషన్ అధికారులు స్పందించి సీసీ రోడ్డు నిర్మించాలని రైతుల కోరుతున్నారు. అలాగే రోడ్డుకు ఇరువైపుల ఉన్న కంప చెట్లను కూడా తొలగించాలని విన్నవిస్తున్నారు.

వైభవంగా మహా కుంభాభిషేకం





శివపార్వతులకు హారతి ఇస్తున్న వేదపండితుడు, మహిళలకు ఒడి బియ్యం పోస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని సంజీవ నగర్ కోదండ రామాలయంలో బుధవారం శ్రీ భగవత్ సేవా సమాజం ఆధ్వర్యంలో స్వర్ణోత్సవ మహాకుంభాభిషేక వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. పుష్పగిరి శంకరాచార్యులు మహా సంస్థాన పీఠాధిపతి శ్రీ విద్యాసంకర భారతి మహాస్వామి వారి శిష్య బృందం ఆధ్వర్యంలో ఉదయం ఏడు గంటలకు గోపూజ వరుణాయానాము, గణపతి పూజ, దేవతావనము, పంచగవ్య త్రసనము, యాగశాల ప్రవేశము,వాస్తు పరిగణీకరణం, అఖండ దీపస్థాపన, మండపారాధనలు, బ్రహ్మ కలశ స్థాపన, రామతారకం, నారాయణ పారాయణం, శివ పంచాక్షరి, మూలమంత్ర జపాలు, నవచండీ పారాయణం, సుందరకాండ పారాయణం, వేదపారాణాలు నిర్వహించారు. అనంతరం మహా మంగళహారతి ఇచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. రుత్వికులకు వస్త్రదాన వితరణ కార్యక్రమాలు నిర్వహించారు.

మహిళలకు సామూహిక ఒడిబియ్యం

కుటుంబం పెద్దలుగా మేమున్నామంటూ శ్రీభగవత్ సేవాసమాజ్ సభ్యులు దాదాపుగా 300 మంది మహిళలకు సామూహిక ఒడిబియ్యం కార్యక్రమం చేపట్టారు. వేద పండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా కొత్త చీరా, గాజులు పసుపు, కుంకుమ, బియ్యం ఇచ్చారు. ఈ సందర్భగా ఆలయ అధ్యక్షుడు సూరయ్య మాట్లాడుతూ ఒడి బియ్యం కార్యక్రమం కుటుంబంలో ప్రేమానురాగాలను పెంచుతుందన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, మధుసూదన్, వంశీ, గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తెరుచుకోని అంగన్‌వాడీ కేంద్రాలు

- చోద్యం చూస్తున్న సూపర్‌వైజర్
- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది



చిన్నవంగలి గ్రామం ఎస్సీ కాలనీలో తెరుచుకోని అంగన్‌వాడీ కేంద్రం



పెద్దవంగలి గ్రామంలో మూతపడిన అంగన్‌వాడీ కేంద్రం

చాగలమర్రి: మండలంలోని పెద్దవంగలి, చిన్నవంగలి, చింతలచెరువు గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు మూతపడ్డాయి. ఈ కేంద్రాలపై సూపర్‌వైజర్ పర్యవేక్షణ లేకపోడమే దీనికి కారణంగా తెలుస్తోంది. ఈ నెల 1వ తేది నుంచి 15వ తేది వరకు సహాయ కార్యకర్తలకు వేసవి కాల సెలవులు ఇవ్వడంతో ఆ సమయంలో అంగన్‌వాడీ కార్యకర్తలు విధులు నిర్వహించారు. అనంతరం ఈ నెల 16వ తేది నుండి నెల చివరి వరకు కార్యకర్తలకు సెలవులు ఇవ్వడంతో సహాయ కార్యకర్తలు విధులు నిర్వహించాలి. అయితే సహాయ కార్యకర్తలు గత కొన్ని రోజులుగా విధులకు డుమ్మా కొడుతుండటంతో అంగన్‌వాడీ కేంద్రాలు తెరుచుకోవడం లేదు. దీంతో చిన్నారులు, బాలింతలు, గర్భిణులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టించుకోవాల్సిన ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చోద్యం చూస్తున్నారని, కేంద్రాల మూతపై పత్రికల్లో కథనాలు వస్తే మామూళ్లు తీసుకొని వదిలేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు



పిల్లలను బడికి పంపాలని ప్రచారం చేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): పిల్లలకు బాగా చదివిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని స్టార్ సొసైటీ బుడగజంగాల పాఠశాల నిర్వాహకులు రాజేశ్వరమ్మ అన్నారు. బుధవారం ఆమె జిల్లాలోని ఆళ్లగడ్డ, కోవెలకుంట్ల, బనగానపల్లె, బేతంచెర్లలలోని బుడగ జంగాల కాలనీల్లో తిరిగి పిల్లలను తమ పాఠశాల హాస్టల్‌లో చేర్పించి చదివించాలని ప్రచారం చేశారు. వైఎస్సార్‌నగర్‌లో బుడగజంగాల పిల్లల కోసం ప్రత్యేకంగా హాస్టల్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి సుంకమ్మ, నాగలక్ష్మి, సుబ్బరాయుడు, బుడగ జంగాల జిల్లా అధ్యక్షుడు జమన్న, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి హరి కథ, బుర్ర కథ పోటీలు

డోన్ టౌన్: పట్టణంలోని కొండపేటలో వెలసిన శాంభవి రేణుక ఎల్లమాంబేశ్వరి జ్యోతిర్లింగేశ్వర స్వామి దేవస్థానం వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని అమ్మవారి జీవిత చరిత్రపై జిల్లా స్థాయి హరికథ, బుర్రకథ పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త ఏఈ నాగరాజు తెలిపారు. బుధవారం వార్షికోత్సవ కర పత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 1న అమ్మవారికి వార్షికోత్సవ పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. హరికథ, బుర్రకథ పోటీల్లో పాల్గొన దలచిన బృందాలు గురువారం సాయిత్రం లోపు 8520852058 నంబరుకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని, 30న పోటీలు ఉంటాయని తెలిపారు. పోటీల్లో పాల్గొనే వా రు వాయిద్య పరికరాలు వారే తెచ్చుకోవాలని, రవా ణా చార్జీలు చెల్లించడంతో పాటు మొదటి మూడు స్థానాల్లో నిలిచినవారికి బహుమతులు అందజేస్తామన్నారు.

రేపు బహిరంగ వేలం

బండి ఆత్మకూరు: మండల కేంద్రంలోని జనార్దన స్వామి ఆలయ భూములకు ఈనెల 30న కౌలుకు బహిరంగ వేలంపాటలు నిర్వహిచనున్నట్లు ఈఓ నాగప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆలయానికి సంబంధించి 17 ఎకరాల భూమి ఉందని, ఆసక్తి ఉన్న రైతులు రూ.1,000 ధరావత్తు చెల్లించి , వేలం పాటలో పాల్గొనాలన్నారు.

వందే భారత్ ట్రైన్‌ను డోన్‌లో ఆపాలి



డీఆర్‌ఎంకు వినతి పత్రం అందజేస్తున్న ఆర్పీఐ నాయకులు

డోన్ టౌన్: హైదరాబాద్ నుంచి బెంగళూరుకు వెళ్లే వందే భారత్ రైలు డోన్‌లో ఆపాలని(స్టాపింగ్) ఆర్పీఐ రాష్ట్ర నాయకులు హుసేనప్ప, ఎమ్మార్పీస్ నాయకులు భూమ నాగన్న బుధవారం గుంతకల్లు రైల్వే డివిజన్ జనరల్ మేనేజర్ చంద్రశేఖర్ గుప్తకు వినతి పత్రం అందజేశారు. కర్నూలు వరకు వచ్చే తుంగభద్ర ఎక్స్‌ప్రెస్ రైలును కూడా డోన్ వరకు పొడిగించాలని కోరారు. డోన్ రైల్వే జంక్షన్ కావడంతో ఇక్కడికి అనంతపురం, కర్నూలు ఉమ్మడి జిల్లాల నుంచి నిత్యం వందల సంఖ్యలో ప్రయాణికులు డోన్ స్టేషన్‌కు తరలి వస్తుంటారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అలాగే రైల్వేలో జరుగుతున్న సివిల్ పనులను సివిల్ ఇంజినీరింగ్ చేసిన నిరుద్యోగులకు నామినేషన్ పద్ధతిలో కేటాయించాలని కోరారు.



బి.నాగిరెడ్డిపల్లె మెట్ట సమీపంలో నీటిలో ఉన్న గ్రాసం కట్టలు

తడిసిన గ్రాసం..ఆందోళనలో రైతు

రుద్రవరం: మండలంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరి గ్రాసం తడిసిముద్దవుతుంది. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇటీవల మండలంలోని బి.నాగిరెడ్డిపల్లె, చిన్నకంబలూరు, ఎల్లావత్తుల, కోటకొండ తదితర గ్రామాల్లో వరి కోతలు కోయించి ధాన్యం దిగుబడులను ఇళ్లకు చేర్చుకున్నారు. మిగిలిన గ్రాసాన్ని ట్రాక్టరు ద్వారా కట్టలుగా చుట్టించి కళ్లాకు తరలించేందుకు సిద్ధం చేశారు. ఇంతలో భారీ వర్షం కురవడంతో గ్రాసం కట్టలు నీటిలోనే తడిసి పోతున్నాయి. నీటిలో ఉండటంతో గ్రాసం కుళ్లి పనికి రాకుండా పోతుందని రైతులు వాపోతున్నారు.



గ్రామ సమీపంలోని స్వామి అమ్మవార్ల మానం భూమి



రైతులు స్వతహాగా వేసుకున్న దారి

బీళ్లుగా శ్రీరంగాపురం మాన్యం

- కౌలు వేలం నిర్వహించరాదని అధికారులపై టీడీపీ గ్రామ నాయకుల ఒత్తిళ్లు

రుద్రవరం: మండల పరిధిలోని శ్రీరంగాపురం గ్రామంలోని ఈశ్వర, ఈశ్వరమ్మ స్వామి అమ్మవార్ల మాన్యం భూములు బీళ్లుగా మారుతున్నాయి. కౌలుకు వేలం నిర్వహించరాదని గ్రామ టీడీపీ నాయకులు దేవదాయశాఖ అధికారులపై పెట్టిన ఒత్తిడే ఇందుకు కారణమని సమాచారం. శ్రీరంగాపురంలో దేవాలయానికి సంబంధించి దాదాపు 18 ఎకరాల మాన్యం ఉంది. ఆ భూములకు ఏటా నిర్ణీత సమయానికి దేవదాయ శాఖ అధికారులు కౌలు వేలం సాగించేవారు. పొలాలు దక్కించుకున్న వారు సేద్యపు పనులు చేసుకునేవారు. అయితే, గ్రామానికి సమీపంలో ఎస్‌ఎస్ ట్యాంకు రిజర్వాయరు వద్ద సర్వే నంబర్ 529/1లో 89 సెంట్లు, 529లో 2.69 ఎకరాలు కలిపి ఒకటే బిట్ కింద ఉన్న 3.58 ఎకరాల భూమికి గతంలో దారిలేక కేవలం రూ.3వేల నుంచి రూ.4 వేలకు మాత్రమే పాడుకునేవారు. అయితే, ఈ పొలానికి వెళ్లే దారిలో అదే గ్రామానికి చెందిన ఇతర రైతుల సొంత భూములు ఉన్నాయి. వారి భూములకు కూడా దారిలేక ఇబ్బందులు పడేవారు. ఈ సమస్యను పరిష్కరించుకునేందుకు అటు వైపు ఉన్న రైతులందరూ కలిసి తమ పొలాల్లో కొంత స్థలం వదులుకొని అందులో మట్టి రోడ్డు వేసుకున్నారు. దీంతో మాన్యం భూమికి కూడా రాక పోకలు సాగించుకునేందుకు దారి ఏర్పడింది. ఫలితంగా ఈ భూమికి కౌలు వేలం డిమాండు పెరిగింది. అయితే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టీడీపీ నాయకులు ఆ రోడ్డును తొలగించాకే కౌలు వేలం నిర్వహించాలని అధికారులపై వత్తిడి తెస్తున్నారు. తాము సొంతంగా వేసుకున్న దారిని ఎలా తొలగించుకుంటామని మాన్యం భూముల సమీప రైతులు పేర్కొంటున్నారు. దీంతో అధికారులకు ఏం చేయాలో తెలియడం లేదు. ఈ సమస్యపై దేవాలయ ఈఓ రామాంజనేయశర్మ వివరణ కోరగా రోడ్డు విషయంలోనే కౌలు వేలం నిర్వహించలేదన్నారు. త్వరలో పోలీసుల ఆధ్వర్యంలో కౌలువేలం నిర్వహిస్తామని వెల్లడించారు.